ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మంత్రి ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ఉదయం విశాఖపట్నంలోని ఆర్టీసి బస్సు కాంప్లెక్స్‌ను రీజనల్ ఛైర్మన్ దొన్నుదొరతో కలిసి సందర్శించారు. కాంప్లెక్స్‌లో ప్రయాణీకులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసు కున్నారు. నాణ్యమైన ఉత్పత్తులు ప్రయాణీకులకు అందించాలని పలు దుకాణాలు, హెూటల్ నిర్వాహకులకు మంత్రి సూచన చేశారు. హెూటల్‌లో అల్పాహారం సేవించి, టీ తాగారు. అనంతరం బస్సులో ప్రయాణికులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: గ్రామీణ మండలం చినగదిలిలో ఉన్న ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా భీమిలి ఆర్డీవో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం ఉదయం గోదాములను సందర్శించిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి ఉన్న సీళ్లను పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాము లోపల పరిస్థితిని సమీక్షించారు. భద్రతా ప్రమాణాలపై అక్కడ అధికారులకు, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పర్యటనలో భాగంగా విజిటింగ్ రిజిస్టర్లో సంతకం చేశారు. ఆయన వెంట భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్ రెవెన్యూ, ఎలక్షన్ సెల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 42 మంది ఎంపిక

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రముఖ మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థ సెయింట్- గోబియన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ నియమికాల్లో వివిధ అంచెల్లో పరీక్షలు నిర్వహించగా 42 మందిని ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహేశ్వరరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 2 లక్షలు వార్షిక వేతనం ఉంటుందని కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ కార్తీక్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్, మెకానికల్ విభాగాధిపతి రాజేంద్రప్రసాద్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఇన్‌కం టాక్స్ ట్రిబ్యునల్ జడ్జ్

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారిని ఇన్‌కం టాక్స్ ట్రిబ్యునల్ జడ్జ్ సివి.భహదంగ్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆదేశాల మేరకు సహాయ కార్య నిర్వహణ అధికారి ఆనంద్ కుమార్, అర్చక స్వాములు స్వాగతం పలికి ముందుగా కప్పస్తంభం ఆలింగనం తదుపరి స్వామి వారి దర్శనం అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

గీతంలో గణిత శాస్త్ర దినోత్సవం

విశాలాంధ్ర - మధురవాడ: భారతీయ గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజం 137వ జయంతి సందర్భంగా జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో శివ నాడార్ విశ్వవిద్యాలయం (ఢిల్లీ) గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ.సత్యం నారాయణరెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. రామానుజం గణిత శాస్త్రంలో చేసిన అపార కృషిని ప్రపంచ వ్యాప్తంగా గణితాన్ని సరికొత్త దశలో నిలిపిందని తెలిపారు.

కంప్యూటర్ సహ అంతరిక్ష శాస్త్రం వరకు అన్ని రంగాలలోను గణిత శాస్త్రం ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, గణిత శాస్త్ర విభాగం అధిపతి, సదస్సు కన్వీనర్‌లు డాక్టర్ వి.శిరీష, కోఆర్డినేటర్‌లు డాక్టర్ పి.ఫనిభూషన్‌రావు, డాక్టర్ పి.విజయ్‌కుమార్, డాక్టర్ టి.శ్రీలక్ష్మి, డాక్టర్ ఎ.శ్రీధర్, పి.శ్రీహరికృష్ణ పాల్గొన్నారు. జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 536 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు గణిత శాస్త్రంపై క్విజ్‌పోటీలు నిర్వహించి విజేతలకు ముఖ్య అతిధి చేతులు మీదగా బహుమతులు అందజేశారు.

వైసీపీకి ఆడారి ఆనంద్ రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైసీపీకి విశాఖ పశ్చిమ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఆడారి ఆనంద్ కుమార్ తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి శుక్రవారం పంపించారు. విశాఖ డెయిరీ అభివృద్ధి కొరకు పూర్తిస్థాయి సమయాన్ని కేటాయించేందుకు ఆడారి ఆనంద్ కుమార్‌తో పాటు తొమ్మిది మంది డైరెక్టర్స్ కూడా వైసీపీకి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో శరగడం వరాహ వెంకట శంకర్రావు, పిల్లా రమా కుమారి, శీరంరెడ్డి సూర్యనారాయణ, కోళ్ల కాటమయ్య, దాడి పవన్ కుమార్, ఆరంగి రమణబాబు, చిటికెల రాజకుమారి, రెడ్డి రామకృష్ణ, సుందరపు ఈశ్వర్, పరదేశి గంగాధర్‌లు ఉన్నారు. వీరంతా వైసీపీ ప్రధాన కార్యాలయానికి రాజీనామా పత్రాలను పంపించారు. విశాఖ డైరీ అక్రమాలపై ప్రభుత్వం హౌస్ కమిటీ నియమించిన విషయం విధితమే. గత కొన్ని నెలలుగా విశాఖ డైరీలో అక్రమాలు జరిగాయంటూ పక్షాలు చేస్తున్న ఆందోళన నేపథ్యంలో చైర్మన్‌గా ఉన్న ఆ డారి ఆనంద్ కుమార్ వైసీపీకి రాజీనామా చేయడంతో ఆ పార్టీ వర్గాల్లో ఆందోళన నెలకొంది. ఇటీవల మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ కూడా వైసీపీని వీడారు.

తెరిపివ్వని వర్షం
లోతట్టు ప్రాంతాలు జలమయం

కొన్నిచోట్ల నేలమట్టమైన ఇళ్లు
ఓ పక్క చలి... మరోపక్క వర్షంతో వణుకుతున్న జనం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: శీతల గాలులతో వణికిపోతున్న ప్రజలకు తుఫాను ప్రభావం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు మరింత అల్లాడిపోతున్నారు. బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది రాబోయే 12 గంటల్లో ఉత్తర దిశగా కదలనుంది. క్రమంగా ఈ అల్పపీడనం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. తర్వాత 24 గంటల పాటు వాయుగుండం తీవ్రత కొనసాగనుంది. అల్పపీడన ప్రభావంతో ఏపీ, ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కోస్తాంధ్రలో చాలా చోట్ల మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. తీరం వెంట గంటకు 40-50 కిలోమీటర్ల వేగం గాలులు వీచే అవకాశం ఉందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. అల్పపీడనం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో గురువారం రాత్రి నుంచి వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో వర్షం కురుస్తోంది. విశాఖలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది. దీంతో గోపాలపట్నం ఇందిరానగర్‌లో ప్రహరీ

కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. జీవీఎంసీ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన తొలగింపు పనులు చేపట్టింది. గాజువాకలో ఓ ఇల్లు కూలిపోయింది. అరిలోవ, మధురవాడ, మల్కాపురం కొండవాలు ప్రాంతాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విశాఖలో గడిచిన 24 గంటల్లో 34 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అలాగే తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, గరిష్ఠంగా 60 కిలోమీటర్లు వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. భారీ వర్షాల కారణంగా సముద్రం అలజడిగా ఉన్న నేపథ్యంలో రానున్న రెండు రోజులు పాటు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే కళింగపట్నం నుంచి మచిలీపట్నం వరకు ఉన్న అన్ని పోర్టులలో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు వ్యవసాయ

పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. గడిచిన 24 గంటలలో విజయనగరం జిల్లా మెంటాడలో అత్యధికంగా 6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. అలాగే శ్రీకాకుళం, నెల్లూరు, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి తదితర జిల్లాల్లో ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో జనజీవనం స్తంభించింది. వర్షపు నీరు రోడ్లపైకి వచ్చి చేరడంతో వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. రానున్న 24 గంటల్లో భారీగా వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు భయాందోలనలో ఉన్నారు.

బీచ్ కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ శుక్రవారం ఆర్.కె.బీచ్ రోడ్డులో నోవోటల్ ఎదురుగా పాప చిల్డ్రన్ పార్క్ వద్ద తుఫాన్ కారణంగా బీచ్ కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. సముద్ర అలల కారణంగా తీర ప్రాంతానికి నష్టం వాటిల్లుతుందని అందుకు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, సముద్రంలోని అలలు ఉధృతంగా ఉన్నందున ప్రజలు బీచ్ లోనికి వెళ్ళకుండా చర్యలు చేపట్టాలని జివిఎంసి జోనల్ కమీషనర్ ఎమ్.మల్లయ్యనాయుడును కమీషనరు ఆదేశించారు.

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సదుపాయాలు కల్పించాలి

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల గురించి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు అనువైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే లక్ష్యంతో అధికారులు పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నడిపేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గాజువాక, ఆటోనగర్ వద్ద గల కన్స్ట్రక్షన్ ఆఫ్ రోడ్ ఓవర్ బ్రిడ్జి, పెదగంట్యాడ, అగనంపూడి మరియు ఆటోనగర్ లలో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, సింగిల్ విండో క్లియరెన్స్, పీఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీలేఖ, జిల్లా పరిశ్రమ శాఖ జీఎం వి.ఆదిశేషు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కొండవాలు, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన విశాఖ నగరంలో భారీగా వర్షాలు కురుస్తున్నందున లోతట్టు, కొండవాలు, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ జీవీఎంసీ అధికారులను టెలి కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఆదేశించారు. నగరంలో భారీగా వర్షం పడుతున్నందున కొండవాలు, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని జీవీఎంసీ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతి అధికారి సంబంధిత ప్రాంతాలలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ కొండవాలు, లోతట్టు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కొండ చర్యలు విరిగిపడే పరిస్థితులు ఉన్నందున ఆయా ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అవసరమయ్యే చర్యలు చేపట్టాలని జీవీఎంసీ ఉన్నతాధికా రులతో పాటు యుసిడి - ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణిని కమిషనర్ ఆదేశించారు. పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి భోజనం, తాగునీరు, వైద్య సదుపాయం, విద్యుత్తు మొదలైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను కమీషనరు ఆదేశించారు. ముఖ్యంగా నగర ప్రజలు ఆందోళన గురికావద్దని, జీవీఎంసీ అన్ని రకాల ప్రత్యామ్నాయ చర్యలు ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేపడుతుందని, ప్రజలు అవగాహనతో జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలి

మంత్రి లోకేష్‌కి వీఎంఆర్డీఏ ఉద్యోగుల సంఘం వినతి

విశాలాంధ్ర - విశాఖ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (వీఎంఆర్డీఏ) ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును 60 నుండి 62 సంవత్సరాలకు పెంచారని కోరుతూ చైర్ పర్సన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో వీఎంఆర్డీఏ స్టాఫ్ అండ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యువిఎస్ఆర్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవిశంకర్‌లు మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి నారా లోకేష్ ని గురువారం మంగళగిరిలో ఆయన నివాసంలో కలసి వినతి పత్రం పత్రాన్ని అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేసిన 196 మంది ఆదర్శ్ విద్యార్థులు

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేసిన 196 మంది విద్యార్థులకు లోమ ఐటి సర్టిఫికెట్స్ అందజేశామని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ గెస్ట్‌గా లోమ ఐటి సొల్యూషన్ మధుకర్ రెడ్డి (టెక్నికల్ డైరెక్టర్), శ్రీనివాస్ రెడ్డి, (సీఈఓ), టి.థియోఫీలస్ (సెక్రటరీ కరస్పాండెంట్) ఆధ్వర్యంలో 196 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేసినట్లు తెలియజేశారు. ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ ట్రైనింగ్ ప్లేస్మెంట్ సెల్ సౌజన్యంతో, స్కిల్ ఎడ్యుకేషనల్ లో వివిధ సంస్థలైన ఏపీ ఎస్ ఎస్ డి సి, ఇస్రో, మాంగోడిబి, మిలీనియం, ఉన్నతి, మైక్రోసాఫ్ట్, లోమ ఐటి సొల్యూషన్ మొదలైన కంపెనీల ద్వారా విద్యార్థులకు మంచి నైపుణ్య ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, విద్యార్థులకు బలమైన కమ్యూనికేషన్ స్కిల్స్ ఇచ్చే ఎడ్యుకేషనల్ సంస్థ ఆదర్శ్ డిగ్రీ కాలేజ్ అని వైస్ ప్రిన్సిపాల్ ఎడికే రాజు తెలిపారు. ఈ సంవత్సరంలో ఆదర్శ్‌లో సర్టిఫికెట్ కోర్సెస్ పూర్తి చేసుకున్న దాదాపు1000 మంది విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానం చేసామని, విద్యార్థులు అవకాశాన్ని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి విద్యార్థి సుమారుగా 20 స్కిల్ సర్టిఫికెట్స్‌తోపాటు డిగ్రీ సర్టిఫికెట్ సంపాదించాలని కరస్పాండెంట్ టి.థియోఫిలస్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ప్లేస్మెంట్ సెల్ ఆఫీసర్ జి.కమలరాణి, ఐ.ఐ.సి కోఆర్డినేటర్ కె.ఎస్.ఆర్ రాజేష్ రావు, డి.సింహాచలం, డి.టి రమ్య, నాగరాజు పాల్గొన్నారు.

న్యూ పోర్టు సీఐని కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: న్యూ పోర్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న తోకడ కామేశ్వరరావు విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో పెద గంట్యాడ టీడీపీ నాయకులు కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య,నమ్బారు సింహాద్రి, మొల్లి రమణ, కాకినాడ అప్పల రాజు,నీలాపు అప్పల రెడ్డి, దొమ్మేటి పెరుమాళ్, పులి అప్పల రెడ్డి, భాస్కర్, బస అప్పల రెడ్డి, పులి శ్రీరామ రెడ్డి, పులి అప్పల రెడ్డి, ఉరుకుటి అప్పల రాజు, కడవల రమణ, మొల్లి అప్పారావు, దొమ్మేటి సోము నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలో మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా

మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎంపీపీ రాంబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఈ.ఈశ్వరరావు, బి.సత్యనారాయణ, పి.పద్దు, ఎస్.నారాయణరావు, కే.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పాలవలసలో రెవెన్యూ సదస్సు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం పాలవలస గ్రామపంచాయతీలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు పలు ఫిర్యాదులు అందాయని అందులో భాగంగా రీ సర్వేలో ముఖ్యంగా కొలతల్లో తేడాలు ఉన్నట్లు రైతులు తెలిపారు. అవకాశం మేర సమస్యను పరిష్కారం చేస్తామని డిటీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నాగోతి అచ్చియమ్మ, ఎంపీటీసీ రౌతు శ్యామల వెంకట్రావు, జనసేన మండల పార్టీ ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, భీమిలి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రౌతు శ్రీను, నాగోతి మహేష్, నిమ్మల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

తీరం కోతకు గురికాకుండా చర్యలు చేపట్టండి

విశాలాంధ్ర - భీమిలి: ఉత్తరాంధ్ర జిల్లాలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు, సముద్రం అలల తాకిడికి తీరం కోతకు గురవుతుందని వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని భీమిలి జోనల్ అధికారులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు సూచించారు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సందర్భంగా గత నాలుగు రోజులుగా ఎడతెర్పిలేకుండా కురుస్తున్న వర్షాలకు, ఉప్పెనలా పొంగుతున్న సముద్రపు అలలతాకిడికి తీర ప్రాంతం కోతకు గురవుతుందని గంటా నూకరాజు అన్నారు.

ముఖ్యంగా మత్స్యకారుల గ్రామం బోయవీధి సామాజిక భవనం ఎదురుగా తీరప్రాంతం వెంబడి ఉన్న గోడ సముద్రం అలల తాకిడికి లోపలకు సొచ్చుకొని రావడంతో ప్రమాదఘడియల్లో ఉందని అన్నారు. నోవేటల్ ఎదురుగా సముద్రం ఇంకా ముందుకు వస్తుందని అన్నారు. ప్రస్తుతం ఈ రెండు ప్రాంతాల్లో తాత్కాలికంగా కోతకు గురికాకుండా నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. లేనిపక్షంలో సముద్రం ముందుకు వచ్చి తీరం గోడతో పాటు రోడ్లు అన్నీ కొట్టుకుపోయే పరిస్థితి ఉందని అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు ఎక్కడైతే సముద్రం కోతకు గురవుతుందో ఆ ప్రాంతాన్ని సందర్శించి స్థానిక మత్స్యకారులతో చర్చించి నివారణ చర్యలు చేపట్టాలని గంటా నూకరాజు కోరారు.

అంబులెన్స్‌లను ప్రారంభించిన సీపీ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ నగర పరిధిలో ప్రతి రోజు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారు వెంటనే ఆసుపత్రులకు చేరుకోలేక సరైన సమయంలో చికిత్స అందక రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. దీనిని నివారించడానికై విశాఖపట్నం సిటీ పోలీస్ వారు, అపోలో హాస్పిటల్స్ వారి సహకారంతో అంబులెన్స్ సేవలను సీపీ శంకబ్రాత బాగ్చి

ప్రారంభించారు. సిటీ పోలీస్ యూనిట్ పరిధిలో జరుగు రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి, తక్షణం వైద్య సేవలు అందించే విధంగా రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకొని, క్షతగాత్రులను దగ్గరలో ఉన్న హాస్పిటల్‌కు తరలించేందుకు గాను ఈ అంబులెన్స్‌లను ఉపయోగించనున్నారు. అంబులన్స్ సేవలు కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 8498091066ను సంప్రదించాల్సిందిగా సీపీ ప్రజలను కోరారు.

విశాఖకు గ్లోబల్ జియోపార్క్ గుర్తింపు అవసరం

విశాలాంధ్ర - మధురవాడ: విశాఖలో భౌగోళిక ప్రాధాన్యత గల ఎర్రమట్టి దిబ్బలు, తీరప్రాంతంలోని శిలలు, ప్రస్తుత మన్యం జిల్లాలోని బొర్రాగుహలు, బాక్సైట్ ఖనిజం, ప్రాచీన భౌద్ధ క్షేత్రాలను యునెస్కో గ్లోబల్ జియోపార్క్ గుర్తింపు తీసుకురావడం అవసరమని దీనికి ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) తగిన కృషి చేస్తోందని ప్రముఖ భూగర్భ శాస్త్రవేత్త, ఇంటాక్ విశాఖ కన్వీనర్ డాక్టర్ డి.రాజశేఖరరెడ్డి వెల్లడించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ చరిత్ర విభాగంలో శుక్రవారం నిర్వహించిన "సంస్కృతి పరిరక్షణ - సవాళ్ళు, అవకాశాలు" సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా 48 దేశాలలో ప్రస్తుతం 213 వరకు యునెస్కో గ్లోబల్ జియోపార్క్‌లు ఉన్నాయని ఆయన తెలిపారు. దేశంలో వివిధ రాష్ట్రాలలో ఐదు ప్రాంతాలను జియోపార్క్ గుర్తింపు పొందడానికి అర్హమైనవిగా ప్రభుత్వం గుర్తించిందని వాటిలో విశాఖ గ్లోబల్ జియోపార్క్ ఒకటి అని తెలిపారు. యునెస్కో గుర్తింపు లభించాలంటే రెండు సంవత్సరాల ముందు నుంచి ప్రయత్నాలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. ఈ గుర్తింపు లభిస్తే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించవచ్చునన్నారు. కార్య గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అధిపతి డాక్టర్ సుష్మారాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ చారిత్రక నిపుణురాలు రాణిశర్మ, అమెరికాకు చెందిన నేషనల్ పార్క్ నిపుణురాలు డేవిడ్ మాన్స్కి, ఫుల్ బ్రైట్ స్కాలర్‌లు, డాక్టర్ నళిని బిక్కిన, శ్రీనివాస్ రెడ్డి, షీరాసింగర్ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు. గీతం చరిత్ర విభాగం అధిపతి అధితి ముఖర్జీ, జీసిజీసి అధిపతి కె.ఉమాదేవి, ఫైన్‌ఆర్ట్స్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం అధిపతి డాక్టర్ అముక్తమాల్యద తదితరులు పాల్గొన్నారు.

పాల సముద్రం జాతీయ చిత్రలేఖన శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - విశాఖ సిటీ: నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్, నార్కోటిక్స్ (ఎన్ఏసీఐఎన్) ఆధ్వర్యంలో సర్ జేజే స్కూల్ ఆఫ్ ఆర్ట్, ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్ సహకారంతో 'పాలసముద్రం జాతీయ చిత్రలేఖన శిబిరం' నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం సమకాలీన భారతీయ కళకు చెందిన 25 మంది ప్రసిద్ధ కళాకారులను ఒకచోట చేర్చింది. వీరందరూ సర్ జెజె స్కూల్ ఆఫ్ ఆర్ట్, ఆర్కిటెక్చర్, డిజైన్ పూర్వ విద్యార్థులు. సుందరీకరణలో భాగంగా ప్రత్యేకమైన, అర్థవంతమైన కళాకృతుల సృష్టిలో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. వారం రోజులు పాటు నిర్వహించిన శిబిరానికి విశేష స్పందన లభించింది. పాలసముద్రంలోని నాసిన్ ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్ గైగోంగ్డిన్ పన్మేయి మాట్లాడుతూ 'ఈ చిత్రలేఖన శిబిరం కళ, ప్రయోజనాల ప్రత్యేకమైన కలయిక. ప్రదేశాలను ప్రేరేపించడానికి, మార్చడానికి సృజనాత్మకతకు ఉన్న శక్తిని సూచిస్తుంది. మా క్యాంపస్‌లో శాశ్వత వారసత్వాన్ని మిగిల్చే ప్రతిభావంతులైన కళాకారుల బృందానికి ఆతిథ్యం ఇవ్వడం మాకు గౌరవంగా ఉంది" అన్నారు .

వరి పొలాల పరిశీలన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలంలో జగన్నాథపురం, కుసులువాడ, పొడుగుపాలెం, వెల్లంకి గ్రామాల్లో వరి పొలాలని శుక్రవారం సందర్శించారు. మండలంలో సుమారుగా 35 ఎకరాలు వరకు వరి పంట కోత కోసి, పనల్లో ఉన్నట్టు,అలానే తుఫాను కారణంగా సుమారు 175 ఎకరాలు వరకు రైతులు వరి పంట కోత కోయకుండ వాయిదా వేసుకున్నట్లు తెలియపరిచారు. నీరు పొలాల్లో నిలిచినట్లైతే వెంటనే గట్లు కొట్టి నీటిని బయటికి పంపేలా తగు చర్యలు తీసుకోమని ,అలానే తుఫాను ఉధృత తగ్గగానే ధాన్యం మొలకెత్తకుండా 2 శాతం ఉప్పు ద్రావణం పనలు తడిచేటట్టు పిచికారీ చెయ్యవలసినది గా రైతులకు సూచించారు. 2% ఉప్పు ద్రావణం అనగా ఒక లీటర్ నీటిలో 20 గ్రాములు కళ్ళు ఉప్పు (గడ్డ ఉప్పు)ను, అనగా ఒక ట్యాంక్ నీటిలో సుమారు 250 గ్రాములు ఉప్పు కలిపి పిచికారీ చెయ్యమని సూచించారు.అలాగే కొన్ని పొలాల్లో చేలు పడిపోయిన సందర్భాలలో, వెంటనే పాయలు తీసి ప్రక్క ప్రక్క ఉన్న దుబ్బులను కలిపి కట్టలుగా కట్టి నిలబెట్టమని రైతులకు వివిధ సూచనలు అందచేశారు. జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు మండల ఏవో సంధ్యా రత్నప్రభ ఉన్నారు.

పోర్ట్‌లో ఘనంగా 54వ అంతర విభాగా క్రీడోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీలో 54వ అంతర విభాగ క్రీడోత్సవాలు 2024-25 పోర్ట్ డైమండ్ జూబిలీ స్టేడియంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని విశాఖపట్నం పోర్ట్ స్పోర్ట్స్ కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు, డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేశ్ కుమార్ దుబే ముఖ్య

అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ క్రీడోత్సవాల్లో క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హాకీ, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బ్యాడ్మింటన్, టేనికాయిట్, బాడీ బిల్డింగ్, చెస్, క్యారమ్స్ మరియు అథ్లెటిక్స్ వంటి క్రీడలు నిర్వహించబడతాయి. ఈ పోటీలలో పురుష, మహిళా ఉద్యోగులతో పాటు దివ్యాంగులకు పోటీలను నిర్వహిస్తున్నారు. క్రీడలు పట్ల ఆసక్తి ఉన్న ఉద్యోగులంతా ఉత్సాహంగా పోటీలలో పాల్గొంటున్నారు. ఈ క్రీడలలో విజేతలుగా నిలిచిన వారికి 26 జనవరి 2025న రిపబ్లిక్ డే సందర్భంగా బహుమతులతో సత్కరిస్తారు. వార్షిక క్రీడోత్సవాలు విశాఖపట్నం పోర్టు అథారిటీ ఉద్యోగులలో శారీరక దారుఢ్యం, స్నేహభావం మరియు సమగ్రతను పెంపొందించడంలో భాగంగా ఏటా పోర్ట్ యాజమాన్యం క్రీడలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో టి.వేణు గోపాల్, ఆల్ ఇండియా మెజర్ పోర్ట్స్ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు, ఎస్. శివ కుమార్, వైస్ ప్రెసిడెంట్, వీపీఎస్‌సి, విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు విశాఖపట్నం పోర్టు క్రీడాకారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక వేడుకలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో జ్ఞాన్ 2కె24 పేరుతో రెండు రోజులు పాటు జరగనున్న వైజ్ఞానిక వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని అవంతి విద్యా సంస్థల చైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులతో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అనేక రంగాలలో ఉద్యోగ అవకాశములు విస్తృత స్థాయిలో అందుబాటులో ఉన్నాయని, పాఠ్య పుస్తకాల్లోని మూల సిద్ధాంతాలు వాటి ప్రయోగాత్మక నైపుణ్యంపై అవగాహన ఏర్పరచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి ఉద్యోగ సాధన కోసము ప్రాక్టికల్ నాలెడ్జ్ ముఖ్యమైనది అని ఉద్ఘాటించారు. అసోసియేట్ డైరెక్టర్, సైంటిస్ట్, ఎన్.ఎస్. టి.ఎల పి.వి.ఎస గణేష్ కుమార్, ఎమ్.వి.ఎస్.దుర్గాప్రసాద్, డాక్టర్ కె మురళీకృష్ణ, ఎమ్. హేమ, డాక్టర్ ఆర్. శ్రీను నాయక్, బి.రవి, సాయి సతీష్, డాక్టర్ రామ్ కుమార్ రాందేవ్, ప్రిన్సిపాల్ డా. బి. మురళీకృష్ణ , డైరెక్టర్ డా. ఎ. చంద్రశేఖర్ పాలిటెక్నిక్ ఇంచార్జి ప్రిన్సిపాల్ జగదీష్ , అవంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ , వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, భోదన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విభూతి యోగంపై 3వ రోజు ప్రవచనాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: వేదాంత ఇనిస్టిట్యూట్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయు వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన ప్రవచనాలు మూడో రోజైన శుక్రవారం కొనసాగాయి. భగవద్గీత లోని 10వ అధ్యాయం అయిన విభూతియోగం" మీద ఇంగ్లీషులో జరుగు ఐదు రోజుల జ్ఞాన యజ్ఞం (ప్రవచనాల) లో భాగంగా మూడవ రోజు స్వామి పార్థసారథి శిష్యురాలైన శు షిలాజి శ్రీక్రిష్ణుడి వివిధ రూపాలలో ఉన్న అంతులేని దివ్య మహిమలను తెలిపారు. అన్ని జీవులలో ఆత్మరూపంలో ఉన్నది నేనేనని, ఏ విధంగా అలలు సముద్రంలో ఉదయించి, సముద్రంలోనే ఉండి, సముద్రంతోనే ఐక్యం చెందుతాయ్యో అలాగే జీవులన్ని నాలోనే పుట్టి, నాలోనే జీవించి, నాలోనే ఐక్యం అవుతాయని శ్రీక్రిష్ణుడు చెప్పారని చెప్పారు. సకల చరాచర జీవరాసులకు, విశ్వమంతటికి ఆధారం ఆత్మరుపంలో ఉన్న శ్రీక్రిష్ణుడేనని, ఏ విధంగా బంగారు ఆభరణాలకు బంగారం మూలమో ఆత్మ అన్ని వస్తువులకు, ప్రాణులకు మూలమని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముందు భజన కీర్తనలను ఆలపించారు. వేదాంత ఇనిస్టిట్యూట్ విశాఖపట్నం ట్రస్ట్ సభ్యులు, విద్యా ర్థిని, విద్యార్థులతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్వామీ పార్థసారథి వివిధ అంశాలపై రచించిన పుస్తకాలు ప్రదర్శనకు ఉంచారు.

వెంకటాద్రి స్వామికి ఘనంగా పంచామృత అభిషేకం

విశాలాంధ్ర - పెందుర్తి: ఉత్తరాంధ్ర తిరుపతి పెందుర్తి వెంకటాద్రిపై ధనుర్మాషోత్సవాలు ఐదో రోజు వైభవంగా జరిగాయి. ఉదయం 4 - 30 గంటలకు స్వామివారిని మేల్కొల్పి, పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం తనయ విన్నపం చేసి హారతి చేశారు. సేవకాలం, శాత్తుమొరై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, 6 రకాల ప్రసాదాలను స్వామి వారికి నివేధన చేసి భక్తులకు తీర్థ గోష్ఠి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మహర్షి రామానుజాచార్యులు తెలియజేశారు. ఓవైపు వర్షం కురుస్తున్న భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామానుజాచార్యులు మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు ఉదయం 4 - 30 గంటల నుండి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే కొండ దిగువ నుండి కొండపైన ఉన్న ఆలయం వరకు భక్తులకు ఉచిత వాహన సదుపాయం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం తరపున అన్ని రకాల ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో నీలిమ తెలియజేశారు.

రియల్‌మీ 14 ఎక్స్ 5 జి స్మార్ట్‌ఫోన్ విడుదల

విశాలాంధ్ర/విశాఖపట్నం: రియల్‌మీ అనేది ఒక పేరుగాంచిన స్మార్ట్‌ఫోన్ బ్రాండ్. అది తాజాగా రియల్‌మీ 14 ఎక్స్ 5 జి అనే స్మార్ట్‌ఫోన్‌ని లాంచ్ చేసింది. ఇది దాని స్మార్ట్ఫోన్ పోర్ట్‌ఫోలియోకి ఒక అద్భుతమైన జోడిరపు. రియల్‌మీ 14 ఎక్స్ 5 జి విభాగంలో మొదటి ఐపి 69 దూళి, నీటి నరోధకత ఉన్న, మిలిటరీ- గ్రేడ్ షాక్ నిరోధకతని కూడా కలిగిన, అతి పెద్ద 6000ఎంఏహెచ్ బ్యాటరీ + 45వాట్స్ ఛార్జింగ్‌ని, సోనిక్ వేవ్ వాటర్ ఎజెక్షన్, వర్షపు నీటి స్మార్ట్ టచ్ వంటి ఫీచర్స్‌ని అందిస్తుంది. రియల్‌మీ 14 ఎక్స్ 5 జి క్రిస్టల్ బ్లాక్, గోల్డెన్ గ్లో, జువెల్‌రెడ్ అనే మూడు అద్భుతమైనరంగుల్లో లభిస్తుంది. ధర విషయంలో రూ.14,999కు 6జీబీ + 128జీబీ, రూ.15,999కు 8జీబీ + 128జీబీ వేరియంట్లు లభిస్తాయి. రియల్‌మీ డాట్ కామ్, ఫ్లిప్‌కార్ట్, ఇతర ముఖ్య చానల్స్‌లో అమ్మకానికి అందుబాటులో ఉంటుంది.

దిశా సమావేశానికి నివేదికలతో రావాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 23వ తేదీన విశాఖపట్టణం ఎంపీ శ్రీభరత్ అధ్యక్షతన కలెక్టరేట్ మీటింగు హాలులో జరగబోయే దిశా (డిస్ట్రిక్ట్ డెవలప్మెంట్ కో-ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లాస్థాయి అభివృద్ధి సమన్వయ- మానటరింగ్ కమిటీ) సమావేశానికి పక్కా నివేదికలతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం సాయంత్రం సమన్వయ కమిటీ నిర్వహించారు. నివేదికల రూపకల్పన ఇతర అంశాలపై సమీక్షించారు. జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తితో పాటు వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

జీరో కమీషన్ ఫుడ్ డెలివరీ యాప్ వాయు ఆవిష్కరణ

విశాలాంధ్ర- విశాఖపట్నం: భారతదేశపు మొట్టమొదటి జీరో కమీషన్ ఫుడ్ డెలివరీ అగ్రగామి యాప్ వాయు దేశవ్యాప్తంగా 25 నగరాలకు తన ఫుడ్ డెలివరీ విస్తరణను ప్రకటించింది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ రంగంలో సరికొత్త బెంచ్‌మార్క్ సాధించినదని ఆ సంస్థ ప్రతినిధి మందర్ లాండే ఈ సందర్భంగా చెప్పారు. ఫుడ్ డెలివరీ రంగంలో 1 లక్ష పైగా రెస్టారెంట్లను ఏర్పాటు చేయనున్నదన్నారు. 6 నెలల్లో 10,000 రెస్టారెంట్లను ప్రారంభించాలని లక్ష్యంగా వాయు పెట్టుకుందన్నారు. ఓఎన్డీసీ వాయు మద్దతుతో నాణ్యత, రుచికరం మరియు వైవిధ్యత మిళితమైన ఒక వినూత్న విధానంతో వినియోగదారులకు చక్కని రుచిరమైన ఆహారం అందిస్తూ స్థానిక రెస్టారెంట్లను బలోపేతం చేస్తుందన్నారు. భారతదేశపు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో 30 శాతం తన స్వంతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

తెలుగు భాషకు పునర్ వైభవం తీసుకు వద్దాం

- పరవస్తు చిన్నయ సూరి జయంతి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తెలుగు భాషకు పునర్వైభవం తీసుకువద్దామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో పరవస్తు విద్యా పీఠం ఆధ్వర్యంలో జరిగిన చిన్నయ్య సూరి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా పరవస్తు చిన్నయసూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నయ సూరి జయంతి వేడుకల్లో పాల్గొనడం పురస్కారం లభించినంత ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తెలుగుభాషలో సౌందర్యం, వాక్యనిర్మాణంలో స్పష్టత, పదాల కూర్పులో చక్కదనం బాగా తెలిసిన వ్యక్తి చిన్నయసూరి అని అభివర్ణించారు. తెలుగు భాషాభివృద్ధికి ఎంతో కృషి చేసిన పరవస్తు చిన్నయసూరి ఆశయాలే స్ఫూర్తిగా ముందుకు సాగుదామన్నారు. తెలుగు వారికి పెద్ద దిక్కు అయిన చిన్నయసూరి ప్రాతః స్మరణీయులని పేర్కొన్నారు. పద్యమునకు నన్నయ, గద్యమునకు చిన్నయ అనే లోకోక్తి ఉందన్నారు. తెలుగుభాషలో సౌందర్యం, వాక్యనిర్మాణంలో స్పష్టత, పదాల కూర్పులో చక్కదనం బాగా తెలిసిన వ్యక్తి చిన్నయసూరి అని మంత్రి అభివర్ణించారు. తెలుగు, సంస్కృత వ్యాకరణం, సాహిత్యం లో చిన్నయసూరి గొప్ప ధీశాలి అని కీర్తించారు. సరళమైన భాషలో, సులభ గ్రాహ్యంగా ఉండే విధంగా చిన్నయసూరి రాసిన 'బాలవ్యాకరణం' తెలుగువారికి వరప్రసాదం అన్నారు. తెలుగు భాషని సమగ్రంగా ఆధునీకరించిన ఘనుడు చిన్నయసూరి అని తెలిపారు. నీతిచంద్రిక, సూత్రాంధ్ర వ్యాకరణం, ఆంధ్ర ధాతుమూల, నీతి సంగ్రహము లాంటి ఎన్నో గ్రంథాలను తనదైన శైలిలో రాసిన చిన్నయసూరి వచనాశైలి అమోఘమన్నారు. ప్రత్యేకించి చిన్నయ సూరి రచించిన నీతి చంద్రిక ఒక తరం వారిని ప్రభావితం చేసిందన్నారు. ప్రస్తుతం తెలుగు భాషకు ఆదరణ తగ్గుతోందని, తెలుగు భాషను కాపాడుకోవడంలో ప్రభుత్వంతోపాటు ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఉందని, తెలుగు విశ్వవిద్యాలయం పునరుద్ధరించడానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. తెలుగు భాష ప్రాధాన్యత తగ్గకూడదని సీఎం చంద్రబాబు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్తున్నారని, ఈ సందర్భంగా మాతృభాషను బ్రతికించుకోవడానికి అందరూ కృషి చేయాలని కోరారు. త్వరలో ఒక కార్యాచరణను రూపొందించుకొని తెలుగు భాషను, జానపద కళలను సమన్వయం చేసుకునే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖపై మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు పలువురు పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని త్వరలోనే విశాఖ పరిసర ప్రాంతాలతో టూరిజం సర్క్యూట్ ను అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే రాష్ట్రంలో పర్యాటక శాఖ నిర్వహించే ఉత్సవాల తేదీలను ప్రకటిస్తామన్నారు. విశాఖ లోని తెన్నేటి పార్క్ వద్ద ఎం.వి మా నౌక ఉన్న ప్రాంతం విశాఖ అటవీ శాఖ పరిధిలోకి వస్తుందని, అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చిన వెంటనే నౌక ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఋషికొండ భవనాల మీద ప్రభుత్వం దృష్టి సారించిందని త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త రవికుమార్ ను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వరపు రామారావు, పరవస్తు ఫణి శయన సూరి, పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు, పరవస్తు చిన్నయసూరి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలోనే ఇఎస్ఐ మెడికల్ కాలేజి పెట్టాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: 14 లక్షల మంది ఇఎస్ఐ సభ్యులు ఉన్న ఉత్తరాంధ్రలో కాకుండా అమరావతిలో ఇఎస్ఐ మెడికల్ కాలేజీని పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని సిఐటియు ఏపీ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి సి హెచ్ నరసింగరావుపేర్కొన్నారు. శుక్రవారం జగదాంబ సీఐటీయూ ఆఫీస్ లో జరిగిన ప్రెస్ మీట్ లో సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె యస్వీ కుమార్, కోశాధికారి ఎస్ జ్యోతేస్వరావు లోతో కలిసి ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు. నరసింగరావు మాట్లాడుతూ ఇఎస్ఐ 500 పడకల ఆసుపత్రి విశాఖలోని షీలానగర్లో నిర్మాణం అవుతున్నది. అక్కడే మెడికల్ కాలేజీ పెట్టడం సరైనదని సిఐటియు భావిస్తున్నదన్నారు. ఆంధ్రప్రదేశ్ అంటే అమరావతి మాత్రమే అనే విధానాన్ని సంకీర్ణ ప్రభుత్వం అమలు చేస్తోందని ఇది సరైన విధానం కాదన్నారు. ఎన్నికలకు ముందు విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్లో విలీనం చేయిస్తామని లేదా సొంతగనులు సమకూరుస్తామని వాగ్దానం చేసినప్పటికీ టిడిపి ప్రభుత్వం ఆ హామీని అమలు చేయలేదు. విశాఖ స్టీల్ అప్పుల్లో ముంచి, ప్రైవేటుకు అప్పజెప్పాలని కుట్ర చేస్తుంది. త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ కాపాడకుండా ఆర్సి మిట్టల్ తో నక్కపల్లిలో స్టీల్ ప్లాంట్ ను ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. 30 సంవత్సరాల నుండి నడుస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడే బాధ్యత టిడిపి ప్రభుత్వాన్ని లేదా?అని ప్రశ్నించారు. ప్రైవేటు పిచ్చితో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని 2014 - 19 కాలంలో టిడిపి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలతో చేసిన ఒప్పందాల్లో ఐదు శాతం కూడా అమలు కాలేదన్నారు. నేడు మరల ప్రైవేటు పారిశ్రామికవేత్తలతో ఆర్భాటంగా చేసే ఒప్పందాలకు విలువ ఎంతని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వచ్చే ఐదు సంవత్సరాలలో ఆర్టీసీలో 12700 బదులు విద్యుత్ బస్సులు కొంటున్నట్టు ప్రకటించింది . ఒక్కొక్క బస్సుకు రెండు కోట్లకు కొని ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పచెప్పాలని పథకం తయారు చేశారు. రాష్ట్రంలో 129 ఆర్టీసీ డిపోలతో పాటు, 423 బస్టాండ్లు, విజయవాడ ,నెల్లూరు కడప, విజయనగరాల్లో జోనల్ వర్క్ షాపులతో సహా అన్ని నగరాల నడిబొడ్డులో వందలాది ఎకరాల స్థలాలు ఉన్నాయి. రెండు లక్షల కోట్ల విలువైన స్థలాలను ప్రైవేటు అమ్మడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధపడుతున్నది. ఆర్టీసీని ధ్వంసం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ కుట్రను సిఐటియు తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు.

తెలుగు వాచకంలో

ఉత్తరాంధ్ర అంశాలు తొలగింపు తగదు

తిరిగి చేర్చాలని ఆచార్య కేయస్.చలం విజ్ఞప్తి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఆంధ్ర ప్రదేశ్ సమగ్ర శిక్షా పరిశోధన సంస్థ(ఎస్ సిఈఆర్ టి) ప్రచురించి విద్యార్థులకు అందిస్తున్న తెలుగు వాచకంలో ఉత్తరాంధ్రకు చెందిన రెండు అంశాలు తొలగించి వేరే ఒక పాఠ్యాంశాన్ని పొందుపరిచారు. దీనిపై ఉపాధ్యాయులు ,స్థానికల్లో తీవ్ర వ్యతిరేకత మవుతుంది. ఈ నేపథ్యంలో ఉత్తరాంధ్ర అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ చైర్మన్ ఆచార్య కేయస్.చలం ఎస్ సిఈఆర్ టి డైరెక్టర్ కు ఈ మేరకు లేఖ రాశారు. తెలుగు పరిమళం 10 తెలుగు వాచకంలో ఉత్తరాంధ్ర కు చెందిన రెండు అంశాలను చేర్చి రాష్ట్ర విద్యార్థులకు తెలుగు సంస్కృతి వైవిధ్యాన్ని అందజేసినందుకు మొదట సంతోషించాం. అందులో రెండు అంశాలు 1. తప్పెటగుళ్ళు 2. శాలిహుండం చేర్చారు. మొదటి దానిలో 5 వాక్యాలు, రెండవ దాంట్లో 11 వాక్యాలు యిచ్చారు. నిజానికి రెండు కలిపి ఒక పజీ కి మించవు. అయిన వాటిని తొలగించి యింకో ప్రతి ప్రచురించారు .సుమారు ఒక పేజీ నిడివిగల శ్రీవారి బ్రహ్మోత్సవాలు, కొమ్ము వాద్యకళ చేర్చారు. మంచిదే. అయితే తెలుగు జాతి గర్వపడే తెలుగు సంస్కృతి చిహ్నాలయిన శాలిహుండం, తప్పెట గుళ్ళు ఎందుకు తొలగించారో అర్థం కాలేదు. నిజానికి తెలుగు సంస్కృతి అంటే తూర్పున బరంపురంతో కుయి భాషతో ప్రారంభవుతుందని ,అది పూర్తిగా దానిలో తమిళ వాసనలు లేని స్వచ్ఛ మయినదని ఎస్ సిఈఆర్ టీ దృష్టి కి తీసుకు వెళ్లారు. వైవిధ్యమయిన ప్రాచీనము, అనాది నుంచి వున్న జానపద సంపదను పిల్లలకు చెప్పవలసిన అవసరం వుందన్నారు.ఉత్తరాంధ్ర అంశాలను తొలగించి వివక్షవంటి భావాలకు అవకాశం కలుగజేసే చర్యను వెనుకకు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మరలా ఈ రెండు అంశాలు చేర్చగలరని ఆచార్య కె యస్ చలం కోరారు.

92వ వార్డులో గోడ కూలిన ప్రాంతాన్ని పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వర్షాలు అధికంగా పడుతున్నందున కొండవాలు ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి. సంపత్ కుమార్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ జోన్-8, 92వ వార్డు పరిధిలోని ఇందిరానగర్ లో భారీ వర్షం కారణంగా గోడ కూలిన ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను కారణంగా నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని అందువలన కొండవాలు జారే ప్రమాదం ఉన్నందున కొండవాలు ప్రాంత ప్రజలు అప్రమతంగా ఉండాలన్నారు. 92వ వార్డు ఇందిరానగర్ లో రోడ్డు పక్కన ఉన్న ఇంటి ప్రహరీ గోడ కూలినందున ఆ ఇంటి వారితోపాటు చుట్టుపక్కల ఉన్న ఇండ్లలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తక్షణమే తరలించి వారికి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కూలిన గోడ పక్కనే ఉన్న కాలువలు పూడికలతో నిండటంతో యుద్ధ ప్రాతిపదికన కాలువలోని వ్యర్ధాలు తొలగించి వర్షపు నీరు సాఫీగా పోయే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ హైమావతి, పర్యవేక్షక ఇంజనీరు రామ్మోహన్రావు, ఎసిపి రామలింగేశ్వర్ రెడ్డి, ఎ.ఎమ్.ఒ.హెచ్ అప్పలనాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజినీరు ప్రవీణ్, సహాయక ఇంజనీర్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.